క్లుప్తంగా

పశువులకు వ్యాక్సిన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామంలో మంగళవారం ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. పాడి ఆవులు, పశువులకు లంపీ స్కిన్ టీకాలు వేసినట్లు ఎచ్చెర్ల పశువైద్యాధికారి రమణ తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో-2 వినోదిని

గార : మండలంలోని చినతూలుగు పాఠశాలను ఎంఈవో-2 వినోదిని మంగళవారం సందర్శించారు. శిక్షా సప్తాహ్‌లో రెండో రోజు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జరుగుతున్న గణిత బోధన తీరును పరిశీలించారు. చతుర్విధ ప్రక్రియలను విద్యార్థులతో బోర్డుపై రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకంబరిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నానుబాల వీధిలో విజయదుర్గా అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిగా మంగళవారం అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణీంద్రశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పింఛన్‌దారుల అర్హతల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో నకిలీ దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలతో 11 మంది సామాజిక పింఛన్లు తీసుకుంటున్నారని గ్రామానికి చెందిన కె.ప్రకాష్‌రావు, తదితరులు జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 11 మంది దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను, అర్హతలను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి మంగళవారం పరిశీలించారు. దీనిపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

27న మండల సమావేశం

రణస్థలం: ఈ నెల 27న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హాజరుకావాలన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు స్ఫూర్తిదాయకం

కవిటి:స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి వంద సేవా కార్యక్రమాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని బల్లిపుట్టుగ సర్పంచ్ శ్రీకన్యా దొళాయి, వైఎస్సార్ సీపీ నేత రజనీకుమార్ దొళాయి అన్నారు. ఇచ్ఛాపురం, కవిటి మండలాల సంయుక్త గ్రామమైన సన్యాసిపుట్టుగ కేంద్రంగా పనిచేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ 2019లో ఏర్పాటై 100వ సామాజిక సేవా కార్యక్రమం బల్లిపుట్టుగలో మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు రూ.10 లక్షల వరకు వివిధ సేవాకార్యక్రమాల ద్వారా వితరణ అందించినట్లు వివరించారు. తాజాగా బల్లిపుట్టుగకు చెందిన మానేక చాందినీకి చికిత్స నిమిత్తం రూ.12,000 ఆర్థికసాయాన్ని అందించారు.

సోంపేట ఎస్ఈబీ సీఐకు ప్రశంసలు



సీఐ జైభీమ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేడీ

సోంపేట: సోంపేట ఎస్ఈబీ సీఐ జైభీమ్‌కు శ్రీకాకుళం ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ గంగాధరం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరం మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలు గుర్తించి సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఈ ప్రశంసాపత్రం పంపించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో సీఐతో పాటు కానిస్టేబుళ్లు కాంతారావు, రాజ్‌కుమార్‌లకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

● 2 రోజులు.. 7 అవధానాలు



నగరానికి చెందిన యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు రెండు రోజుల్లో ఏడు అవధానాలు నిర్వహించి అబ్బురపరిచారు. పలాసలోని పలుచోట్ల ఈ నెల 21, 22వ తేదీల్లో అవధాన ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత సాయి ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

- శ్రీకాకుళం కల్చరల్

● కుప్పలు సరే.. పనులెప్పుడు?



శ్రీకాకుళం నగర పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కాలువ పనుల కోసం రాళ్లు, ఇసుక కుప్పలు వేశారు. రోజులు గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. దీంతో ఇసుక, రాళ్లు పక్కనే ఉన్న కాలువలోకి జారి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

● కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని మంగళవారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపలి సురేష్ కలెక్టర్‌కు వివరించారు. క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, ప్రతినిధులు నటుకుల మోహన్, డాక్టర్ బి.దేవభూషణం, డాక్టర్ పైడి సింధుర, సభ్యులురామ్‌గోపాల్, ఉర్లాం శివతేజ, పొడుగు చరణ్ పాల్గొన్నారు.

- శ్రీకాకుళం పాతబస్టాండ్

● పుస్తకాలు వచ్చేశాయ్



ఎచ్చెర్ల ఎమ్మార్సీకి మంగళవారం ఇంటర్మీడియెట్ పుస్తకాలు చేరాయి. ఎంఈఓ కె.పున్నయ్య మాట్లాడుతూ మండలంలో ఎచ్చెర్ల, కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పొన్నాడ కేజీబీవీ, కుప్పిలి మోడల్ స్కూళ్లకు పుస్తకాలు అందజేస్తామన్నారు. ఈ మేరకు ప్రిన్సిపాళ్లకు సమాచారం అందజేసినట్లు చెప్పారు.

-ఎచ్చెర్ల క్యాంపస్

● ఆధార్ డ్రైవ్



మండలంలోని ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కొనసాగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. బుధవారం తిరుపతిపాలెం, కొండములగాం, వి.ఎస్.పురం, కొవ్వాడ, సీహెచ్ రాజాం గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందన్నారు. ఆధార్ తీసుకుని పదేళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని, కొత్త ఆధార్, పేరు చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు.

-రణస్థలం



బ్యాంకర్స్‌కాలనీ 5వ లైన్‌లో తుప్పలు



ఏఎస్ఎన్ కాలనీలో అడవిని తలపిస్తున్న నివాస స్థలాలు

ఖాళీ స్థలాలు..
వ్యాధులకు వేదికలు!

- దోమలు, పాములు, పందులకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు
- నిర్వహణ పట్టించుకోని స్థల యజమానులు
- ఇబ్బందుల్లో స్థానికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయి దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. శ్రీకాకుళం నడిబొడ్డున ఉన్న బ్యాంకర్స్‌కాలనీ, ఏఎస్ఎన్ కాలనీ, శాంతినగర్‌కాలనీ, హడ్కోకాలనీ, ఇందిరానగర్‌కాలనీ, డీసీసీబీ కాలనీ, జామితోట, విశాఖ-ఏ, విశాఖ-బీ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో కొందరు ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగిపోయి వర్షపునీరు, మురుగునీరు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు విష జ్వరాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని యజమానులు..

స్థలాల యజమానులు అధిక ధరలు వస్తే లాభానికి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. అంతవరకు స్థలాలను ఖాళీగా వది లేస్తున్నారు. పిచ్చిమొక్కలు తొలగించాలని చుట్టుపక్కల వారు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఇరుగుపొరుగు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు సాయంత్రం దోమల బెడద ఎక్కువవుతోంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను స్పందించి మట్టి వేసి ఎత్తుచేయించడం, పిచ్చిమొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



బ్యాంకర్స్ కాలనీ 3వ లైన్‌లో ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు

తీవ్ర దుర్వాసన..



ఇంటి ఎదురుగా ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వర్షపు నీరు చేరి దోమల నిలయంగా మారింది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పశువులు, పందులు, దోమలు స్వైర విహారం చేయడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. అధికారులు సమస్య పరిష్కరించాలి. - ఎస్.సత్యకేశవరావు, బ్యాంకర్స్ కాలనీ, 5వ లైన్, శ్రీకాకుళం నగరం

పాముల బెడద..



మా ఇంటి పక్కన, ఎదురుగా ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయి అడవిలా కనిపిస్తోంది. సాయంత్రం పెద్ద పెద్ద పాములు ఇంటి చుట్టూ తిరుగుతున్నాయి. స్థల యజమానులకు సమాచారం అందించి శుభ్రం చేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు చేపట్టి రక్షణ కల్పించాలి. - మార్పు జగన్నాయుకులు, ఏఎస్ఎన్‌కాలనీ, శ్రీకాకుళం నగరం

చర్యలు చేపడతాం..



ఖాళీ స్థలాల యజమానులను ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. నోటీసులు జారీచేశాం. స్థలాలను ఎత్తుచేయాలని, పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోసారి స్థల యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తాం.

- చల్ల ఓబులేసు, నగరపాలన సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

ఆశ.. నిరాశ



బడ్జెట్ 2024-25

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దళిత, ఆదివాసీ, పెన్షనర్లకు నిరాశ కలిగించేలా, కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాసేలా ఉందని, రైల్వేజోన్ అంశాన్ని విస్మరించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేయగా, కూటమి ప్రభుత్వానికి చెందిన పలువురు నాయకులు మాత్రం బడ్జెట్ కేటాయింపులను స్వాగతిస్తున్నారు.

- శ్రీకాకుళం పీఎన్ కాలనీ/శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్

దళిత, ఆదివాసీలకు దగా



దళిత, ఆదివాసీల దగా చేసిన బడ్జెట్ ఇది. దళిత సంక్షేమం పట్టించుకుని కేంద్ర ప్రభుత్వం కేటాయింపుల్లో మొండిచేయి చూపించింది. రాష్ట్రానికి రాజకీయ స్టేట్‌మెంట్ తప్ప కేటాయింపుల్లో స్పష్టత లేదన్న విషయం సామాన్యుడికి సైతం అర్థమవుతుంది. రాష్ట్రంలో టూరిజం కోసం ఒక్క రూపాయి కేటాయించకపోవడం సరికాదు.

- డి.గణేష్, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి

కలల రాజధానికి సాకారం



అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో రూ.15వేలు కోట్లు కేటాయించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని సాకారం అవుతుంది. పోలవరం పూర్తి చేసేందుకు మరింత తోడ్పాటు అందించడం శుభ పరిణామం. ముద్రా పథకం కింద రూ.20లక్షల వరకూ రుణ సదుపాయం కలిపించడం ద్వారా బడుగులకు మేలు జరుగుతుంది.

- పూడి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

మినహాయింపు కావాలి



కేంద్ర ప్రభుత్వం పింఛనుదారులకు ఇన్‌కం ట్యాక్సు నుంచి పూర్తి స్థాయి మినహాయింపు ఇవ్వాలనేది మాకోరిక. అలా ఇచ్చి ఉంటే బాగుండేది. స్టాండర్డ్ డిడక్షన్ పెంచారు. కొంతమేర మాత్రమే ఊరట కల్పించారు.

- కె.సోమసుందరరావు, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మొక్కుబడి బడ్జెట్



రాజధానికి లక్ష కోట్లు అడిగితే రూ.15వేలు కోట్లు ఇవ్వడం బట్టి చూస్తే ఉచితమా..సాయమా..? తెలియడం లేదు. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు. విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్‌ప్లాంట్ ఊసేలేదు. ఉత్తరాంధ్రకు ఎంత ప్యాకేజీ ఇస్తారో కచ్చితమైన గణాంకాలు లేవు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం వల్ల పరిశ్రమలు రావు. యువత ఉపాధి అవకాశాలు లేకుండా తీవ్ర నష్టానికి గురవుతారు. మొక్కుబడి బడ్జెట్ ఉంది తప్పితే ఎటువంటి లాభం లేదు.

- రౌతు శంకరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి



మధ్యాహ్నభోజన వంటకాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా కల్పించిన సౌకర్యాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి కోరారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సమయాత్తం కావాలని, సిలబస్ సకాలంలో పూర్తిచేసేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. మంగళవారం బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను వమ్మరవల్లి జెడ్పీహెచ్‌స్కూల్ సీనియర్ హెచ్‌ఎం జగదీష్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం ఏవీ మురళీకృష్ణ, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో సమావేశాలు పరీక్షల సన్నద్ధత, టెన్త్ తర్వాత అవకాశాలను వివరించారు. అక్షయపాత్ర ద్వారా అందుతున్న మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించారు. నాడు-నేడు పనులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.సుబ్రహ్మణ్యం, పి.సింహాచలం, వాసుదేవరా వు, పీడీ కె.మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారికి చల్లదనం..
పులకించిన భక్తజనం



శ్రీకాకుళం కల్చరల్:నూకాలమ్మతల్లికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: ఆషాఢ మాస మంగళవారం సందర్భంగా పట్టణంలో పలుచోట్ల అమ్మవార్లకు చల్లదనం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మతల్లి, మరిడమ్మ, నూకాలమ్మతల్లి, అసిరితల్లి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. డప్పువాయిద్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, అమ్మవారి వేషాలు, కళాకారుల ప్రదర్శనలతో పండగ వాతావరణం నెలకొంది. హౌసింగ్ బోర్డు కాలనీ, దేశల్లవీధి, కుందనంపేట, నక్కవీధి, మంగువారి తోట, కాకివీధి, జెడ్పీ ఎదురు కాలనీ, రెల్ల వీధి, తురాయిచెట్టు వీధి, తదితర ప్రాంతాలలో చల్లదనం ఉత్సవాలు సందడిగా జరిగాయి. కాకివీధిలోని ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఫాజుల్‌బాగ్‌పేటలోని అసిరితల్లి-భద్రమహంకాళి అమ్మవారు, పాదాలమ్మతల్లి వార్లకు ముర్రాట్ల సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగువారితోటలో ముత్యాలమ్మతల్లి ఆవేటి వారాలు ఘనంగా నిర్వహించారు.

అరసవల్లి: అరసవల్లి గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆవేటి వారాల పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అరసవల్లి, కాజీపేటకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు.



శ్రీకాకుళం కల్చరల్: కోలాటం ఆడుతున్న కళాకారులు



అరసవల్లి:పూజలందుకుంటున్న అసిరితల్లి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: ఆకట్టుకున్న అమ్మవార్ల వేషధారణలు



శ్రీకాకుళం కల్చరల్: కోలాటం ఆడుతున్న చిన్నారులు



శ్రీకాకుళం కల్చరల్: మంగువారితోటల పండగ సందడి



శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌బాగ్ పేటలో..

పోష్ చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

రణస్థలం: పని ప్రదేశంలో మహిళలకు ధైర్యం కల్పించాలన్నదే లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రధాన ఉద్దేశమని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మహిళ-స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 (పోష్)పై అవగాహన కల్పించారు. మహిళలు ఉద్యోగం చేయాలంటే ముందుగా చైతన్యం కలిగి ఉండాలన్నారు. మహిళలకు భద్రత కల్పించేందుకు పని ప్రదేశంలో పోష్ యాక్ట్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉంటే అక్కడ అంతర్గత ఫిర్యాదుల కమిటీ వేయాలన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వేధింపులు ఎక్కువైపోతున్నాయని, అటువంటి వాటికి కూడా చట్టాల్లో మార్పులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఝాన్సీ, జిల్లా బాలల రక్షణ అధికారి రమణ, ఎంపీడీఓ రమణమూర్తి, ఎంఈఓలు త్రినాధరావు, ఈశ్వరరావు, ఈఓపీఆర్‌డీ విశ్వేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.